క్లుప్తంగా

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్నిప్రమాదాల నివారణపై ప్రయోగాత్మకంగా వివరిస్తున్న అగ్నిమాపక అధికారి సుధాకర్‌రావు

సాలూరు: అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన పెంపొందించుకోవాలని అగ్నిమాపక అధికారి సుధాకర్‌రావు ప్రజలను కోరారు. ఈ మేరకు అగ్నిప్రమాదాల నివారణపై పట్టణంలోని మెయిన్‌రోడ్డులో పెట్రోల్ బంకు వద్ద గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన పెట్రోల్,డీజిల్ కొట్టేటప్పుడు, కొట్టిన తరువాత అగ్నిప్రమాదాలు ఏ విధంగా సంభవిస్తాయి? వాటిని ఎలా నివారించాలనే అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ సిబ్బంది సీతారాం, సురేష్‌కుమార్, నళిని, ప్రజలు పాల్గొన్నారు.

వాడవాడలా జాతీయ నులిపురుగుల దినోత్సవం



ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

బలిజిపేట: జాతీయ నులిపురుగుల దినోత్సవ కార్యక్రమాన్ని మండలంలో విజయవంతం చేశారు. ఈ మేరకు అన్ని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో 1నుంచి 19సంవత్సరాల వయస్సు కలిగిన వారికి మాత్రలు పంపిణీ చేశారు. మాత్రలను నమిలి మింగించి గోరువెచ్చని నీళ్లు తాగించారు. ఈ మాత్రల వల్ల రక్తహీనత, పిల్లల్లో ఎదుగుదల లోపం తగ్గడం, ఏలికపాముల నిర్మూలన జరుగుతుందని వైద్యాధికారిణి క్రాంతికిరణ్మయి తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ సామల సింహాచలం, సీహెచ్‌ఓ వెంకటరమణ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలో సువర్ణముఖి నదీ తీరాన వేంచేసిన వేణుగోలస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువైన లక్ష్మీనృంహస్వామి గురువారం భక్తులకు ప్రత్యేక దర్శనమిచ్చారు. ఆలయప్రధాన అర్చకుడు పీసపాటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు స్వామి వారిని వివిధ రకాల పూలతో అలంకరించారు. స్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో గురువారం ఉదయం 6 గంటలనుంచి వివిధ ప్రాంతాల నుంచి వచ్చి క్యూలోఉన్న భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు.

స్త్రీనిధి రుణాలతో మహిళలకు బహుళ ప్రయోజనాలు



సదస్సులో మాట్లాడుతున్న స్త్రీనిధి జిల్లా ఏజీఎం హేమలత

సీతానగరం: స్త్రీనిధి పథకం ద్వారా పొందనున్న రుణాలతో పొదుపు సంఘాల సభ్యులకు బహుళ ప్రయోజనాలున్నాయని వెలుగు జిల్లా సహాయ జనరల్ మేనేజర్ హేమలత అన్నారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో వీఓఏలతో స్త్రీనిధి వాడకం, వాయిదాలు తీర్చడం తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొదుపుసంఘాల సభ్యులు అత్యవసర పరిస్థితుల్లో రుణాలకోసం వెంపర్లాడకుండా బ్యాంకుల్లోనే వ్యక్తిగతంగా స్త్రీనిధి ద్వారా రూ.లక్ష వరకూ రుణాన్ని పొందవచ్చని, 24 వాయిదాల్లో చెల్లించవలసి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వెలుగు క్లస్టర్ సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

నేడు సున్నా వడ్డీ నగదు జమ

గరుగుబిల్లి: మహిళా సంఘాల సభ్యులకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం నాలుగో విడత నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం విడుదల చేయనున్నట్టు ఏపీఎం పి.అప్పలనాయుడు గురువారం తెలిపారు. మండలంలోని 39 గ్రామాలకు సంబంధించి 1307 మహిళా సంఘాలున్నాయని, ఇందులో 1091 మహిళా సంఘాలకు సున్నా వడ్డీకి అర్హత వుందన్నారు. ఈ మేరకు రూ.1,20,11,897లు మహిళా సంఘాల సభ్యుల ఖాతాలో జమ అవుతుందన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ యుగం

- ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొర



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా అత్యంత పారదర్శకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు సాలూరు పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన, 18వ వార్డు గాంధీనగర్ సచివాలయం పరిధిలో చినకుమ్మరివీధి, దుర్గానవీధిలో గురువారం నిర్వహించిన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి పాల్గొన్నారు. తమ వార్డులోకి వచ్చిన రాజన్నదొరకు ప్రజలు, నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ క్రమంలో ప్రతి ఇంటికీ వెళ్లిన రాజన్నదొర ఇప్పటివరకు జగనన్నపాలనలో ఎంత లబ్ధిచేకూరిందో వివరించారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల పనితీరుపై ఆరాతీశారు. ఇళ్లు, తదితర ప్రజల సమస్యలను విన్న ఆయన వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రాజన్నదొర ప్రజలతో మాట్లాడుతూ, ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి ఇచ్చిన హామీలన్నింటినీ ముఖ్యమంత్రి అమలు చేస్తున్నారని పేర్కొన్నారు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ముఖ్యమంత్రి అందిస్తున్న నగదును మహిళలు సద్వినియోగం చేసుకుని, ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థల వల్ల ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని వివరించారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం జగనన్న పాలనలో అమలువుతుందన్నారు. వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని 2024 ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, ఏఎంసీ చైర్‌పర్సన్ దండిఅనంతకుమారి, కౌన్సిలర్లు, నాయకులు గొర్లె జగన్, జర్జాపు సూరిబాబు, గిరిరఘు, రాపాక మాధవరావు, దండి శ్రీనివాసరావు, మద్దిల గోవింద, ఈదుబిల్లి రమేష్‌నాయుడు, చొక్కాపు గోపీ, కర్రి అప్పలస్వామి, శివ, తదితరులు, తదితరులు పాల్గొన్నారు.

సువర్ణ పాలన

బలిజిపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం హయాంలో రాష్ట్రంలో సువర్ణ పాలన సాగుతోందని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు బలిజిపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గడగడపకు వెళ్లి ప్రభుత్వ హయాంలో పేదప్రజలకు అందిన లబ్ధిని బుక్‌లెట్‌లు అందించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాన్ని సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకం అందిందా? లేదా? అనేది తెలుసుకునేందుకు, అర్హులై ఉండి పథకానికి దూరమైతే ఎందుకు దూరమయ్యారో గుర్తించి వారికి పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు గడపగడపకు వెళ్లి తెలుసుకోవాలని దిశానిర్దేశం చేసి సీఎం జగన్‌మోహన్ రెడ్డి పంపించారాన్నరు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలే కాకుండా గ్రామాలలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో ఎటువంటి లోపాలు ఉన్నా వాటిని తక్షణమే సరిచేసేందుకు గడప గడపకు తిరుగుతున్నామని తెలిపారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించి ఆయనకు మద్దతు పలికి రానున్న రోజుల్లో మళ్లీ సీఎంగా ఆయననే చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బలిజిపేట సర్పంచ్ రాఘలత, ఎంపీపీ జి.నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, బలిజకార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, బి.సత్యనారాయణమూర్తి, వి.సుబ్బారావు, బి.శ్రీనివాసరావు, పి.చైతన్య, పలగర సహకార సంఘం అధ్యక్షుడు పకీరునాయుడు, మండల సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు శ్రీరాములునాయుడు, వ్యవసాయ సలహా సంఘం మండల అధ్యక్షుడు గంగయ్య, సర్పంచ్‌లు విజయ, కె.మోహనరావు, ఆర్.శ్రీనివాసరావు, ఎంపీటీసీ మల్లిక, జి.సత్యంనాయుడు, కె.వెంకటరమణ, పి.నారాయణరావు, ఎ.మహేష్ మాస్టారు, పి.రామకృష్ణ, జి.జగన్, శ్రీనివాసరావు, కె.వెంకటరమణ, ఎ.పోలినాయుడు, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం



బీటీరోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- బీటీరోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే జోగారావు

సీతానగరం: గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి జగనన్న ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చిందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం మండలం పులిగుమ్మి జంక్షన్ నుంచి సీతానగరం మండలం రేపటివలస గ్రామానికి రూ.1.26 కోట్లతో నిర్మించిన 2 కిలో మీటర్లు నిర్మించిన బీటీ రోడ్డును గురువారం ఆయన ప్రారంబించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేపటివలసలో గడపగడపకు వచ్చిన సమయంలో గ్రామానికి ఎటువంటి అభివృద్ధి పనులు చేయాలని కోరగా రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారని చెప్పారు. మూడు నెలల్లోనే రోడ్డు నిర్మించి గ్రామానికి వస్తానని ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి బీటీరోడ్డు నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్ద బేత అప్పలనాయుడు మాట్లాడుతూ రాకపోకలకు అత్యవసర పరిస్థితుల్లో పడుతున్న ఇబ్బందులను మొరపెట్టుకున్నా ఎవరూ స్పందించ లేదన్నారు. జగనన్న ప్రభుత్వంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు స్పందించి హామీ ఇచ్చిన మూడు నెలల్లోనే బీటీరోడ్డు వేయడం మా గ్రామప్రజల అదృష్టమన్నారు. ఇచ్చిన హామీ నిలుపుకున్న జగనన్న ప్రభుత్వానికి తామంతా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



నూతన రోడ్డుపై గుర్రం ఎక్కించి స్వాగతం పలికిన గ్రామస్తులు

గుర్రంపై ఎమ్మెల్యేను ఎక్కించి స్వాగతం

ఎమ్మెల్యే అలజంగి జోగారావును గుర్రంపై ఎక్కించి ఆయన ప్రారంభించిన బీటీ రోడ్డు మీదుగా పూల వర్షం కురిపిస్తూ గ్రామస్తులు స్వాగతం పలికారు.కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వెంకటనాయుడు, ఎంపీటీసీ వై.గౌరీశ్వరి, వై. శ్రీనివాసరావు, బేత వినయ్‌కుమార్, వ్యవసాయ సలహామండలి జిల్లా చైర్మన్ వి. నాగేశ్వరరావు, సీతానగరం, పార్వతీపురం ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, పీఏసీఎస్ చైర్మన్‌లు, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, జెడ్పీ ప్రాజెక్ట్ ఇంజినీరింగ్, సచివాలయం అధికారులు పాల్గొన్నారు.

నీరు విషయమై గొడవ

పార్వతీపురం: పంట పొలానికి నీరు కట్టే విషయంలో అన్నదమ్ముల మధ్య జరిగిన గొడవ కొట్లాటకు దారితీసింది. వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండలం లొద్ద గ్రామానికి చెందిన ఊయక నూకయ్య గెడ్డ పొలంవద్ద పొలానికి నీరు కడుతుండగా తమ పొలానికి పొలానికి నీరు ఇవ్వలేదని ఆయన అన్నయ్య కొడుకు కొత్తన్న..నూకయ్యను కర్రతో కొట్టాడు. దీంతో నూకయ్య తలకు బలమైన గాయంకాగా చికిత్సకోసం 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్సకోసం తరలించారు.

ప్రకృతి సాగుకు గుమ్మలక్ష్మీపురం మండలం ఎంపిక

గుమ్మలక్ష్మీపురం: రైతుల్ని నూరు శాతం ప్రకృతి సాగుబాట పట్టించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అడ్డాకుల చిన్నారావు తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. తొలిదశలో ఒక మండలాన్ని ప్రకృతి సాగులో ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుందని, ఇందులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా నుంచి గుమ్మలక్ష్మీపురం మండలం ఎంపిక చేయడం పట్ల ఆనందాన్ని వెలిబుచ్చారు. ఇప్పటికే ఇక్కడి గిరిజన రైతులు ప్రకృతి సాగులో ముందుకు సాగుతుండగా ప్రభుత్వ నిర్ణయంతో మరింత అభివృద్ధిని సాధిస్తూ, 100 శాతం ప్రకృతి సాగులో ఆదర్శంగా నిలువగలరన్న ఆశాభావం వ్యక్త పరిచారు. కాగా, రైతు సాధికార సంస్థ సిబ్బంది ఎంపిక చేసిన మండలాల్లో సన్న, చిన్నకారు రైతులను గుర్తించి వారిని ప్రకృతి సాగు వైపు మళ్లించేందుకు అవసరమైన చేయూత ఇచ్చేందుకు ఇందుకు సంబంధించిన కీలక బాధ్యతలను గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) కు ప్రభుత్వం అప్పగించిందన్నారు. ఆదర్శ మండలాల్లో పౌష్టికాహారం అవసరమయ్యే వారందరికీ నూటికి నూరు శాతం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులోకి తీసుకురావడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యమని చిన్నారావు పేర్కొన్నారు.

పోర్జా పైడి అసోషియేషన్ కార్యదర్శిగా గడ్డెయ్య

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ పోర్జా పైడి అసోషియేషన్ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శిగా గొర్లె గడ్డెయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రాష్ట్ర అధ్యక్షుడు పట్లాసింగి రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా గంటా అప్పన్న, జిల్లా అధ్యక్షునిగా బిడ్డిక సుధాకర్, ఎన్నికయ్యారన్నారు. కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మండంగి హరనాథ్, పి.ప్రభుకుమార్, ఉపాధ్యక్షులుగా రాజు, కోశాధికారిగా డి.ప్రకాశరావు, కనకరాజు, సోషల్ మీడియా కన్వీనర్‌గా చంటి, జీవన్‌కుమార్, లీగల్ సెల్ కన్వీనర్‌గా శాంతిరాజు, పెంకి కృష్ణారావు ఎన్నియ్యారన్నారు. సభ్యులుగా సంజీవి, బాలకృష్ణ, కాంతారావు, శంకరరావు తదితరులు ఎన్నికయ్యారు.

తల్లిదండ్రుల శ్రద్ధ అవసరం



విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తున్న ఎంఈఓ సామల సింహాచలం

బలిజిపేట: విద్యార్థుల చదువు విషయంలో తల్లిదండ్రుల శ్రద్ధ ఎంతో అవసరమని ఎంఈఓ సామల సింహాచలం తెలిపారు. మండలంలోని పాఠశాలల్లో గురువారం తల్లితండ్రుల సమావేశాలు నిర్వహించారు. అందులో భాగంగా బలిజిపేట ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశానికి హాజరైన ఎంఈఓ సామల సింహాచలం మాట్లాడుతూ విద్యార్థులకు మొదటి గురువులు తల్లిదండ్రులేనని అన్నారు. పిల్లలపై వారికి పర్యవేక్షణ ఎంతో అవసరమని పిలుపునిచ్చారు. పాఠశాల సమయాల్లో విద్యార్థులకు విద్యను అందించడం, వారికి అవసరమైన విధంగా బోధించి, తగు సూచనలు ఇవ్వడం ఉపాధ్యాయుడి పాత్ర అని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రులు తగు సూచనలు చేయాలని, వారి సహకారంతోనే పాఠశాలల అభివృద్ధి ముందుకు సాగుతుందన్నారు. అనంతరం ఎఫ్ఏ 1 పరీక్షల ప్రోగ్రెస్ రిపోర్టులు విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.జయప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ కొరజ్రన్ని సింహాచలం, సర్పంచ్, ఎంపీటీసీ

పాచిపెంట: మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కొరజ్రన్ని సింహాచలం అన్నారు. మండలంలోని కేరంగి పంచాయతీ కొండమోసురులో సర్పంచ్ సోముల లచ్చయ్య ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మైదాన ప్రాంత ప్రజలకు వైఎస్సార్ పోషణ అందిస్తే గిరిజన ప్రాంత ప్రజలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్‌ను ప్రభుత్వం అందిస్తుందన్నారు. గతంలో పోషకాహార లోపంతో గర్భిణులు, చిన్నారులు చనిపోయే పరిస్థితులు ఉండేవని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలో శిశు మరణాల సంఖ్య పూర్తిగా తగ్గిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పౌష్టికాహారాన్ని గర్భిణులకు ఇంటి వద్దకే పంపించాలని ముఖ్యమంత్రిని గతంలో కోరిన నేపథ్యంలో ఆ దిశగా చర్యలు చేపట్టారన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ డోనేరు లచ్చయ్య, సీడీపీఓ అనంతలక్ష్మి, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ జె.రామారావు

పార్వతీపురంటౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ సీఈసీ, హెచ్‌ఈసీ విద్యార్థులకు అధ్యాపకుడు తెర్లి, రవికుమార్‌లు సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను ప్రిన్సిపాల్ జె. రామారావు గురువారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎకనామిక్స్ స్టడీ మెటీరియల్ సులభమైన రీతిలో అర్థమయ్యేలా ప్రచురించిన పుస్తకాలు పంపిణీ చేశామని, ఈ పుస్తకాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు తాతబాబు, శ్రీనివాసరావు, తేజ, తవిటినాయుడులు పాల్గొన్నారు.

నిరంతర ఆదాయం పొందేలా పంటల సాగు



లక్కగూడలో ఏర్పాటు చేసిన ఏటీఎం మోడల్‌ను పరిశీలిస్తున్న మండల టీం లీడర్

గుమ్మలక్ష్మీపురం: నిరంతరం ఆదాయం పొందేలా పంటలను సాగు చేసుకోవాలని ప్రకృతి వ్యవసాయం గుమ్మలక్ష్మీపురం మండలం ఏటీఎం మోడల్ టీం లీడర్ గణేష్ శరత్ చంద్ర అన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా 20 సెంట్ల భూమిలో నిరంతరం ఆదాయం పొందేలా రూపొందించిన ఏటీఎం మోడల్‌ను మండలంలోని లక్కగూడ గ్రామానికి చెందిన పెదపెంకి గోపినాథం అనే రైతు అనుసరిస్తున్నాడు. ఈ మోడల్‌ను గురువారం పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ఈ ఏటీఎం మోడల్‌లో టమాట, వంగ, మిర్చి, గోరుచిక్కుడు, బొబ్బర్లు, మొక్కజొన్న, ఆకుకూరలు, దుంప జాతులు వంటి సుమారు 15 రకాల ఉత్పత్తులను ఏడాది పొడవునా సాగు చేయాల్సి ఉంటుందని, వచ్చిన ఫల సాయాలను ఇంటి అవసరాలు వినియోగించగా మిగిలినవి మార్కెట్లో విక్రయిస్తే ఏడాదికి తక్కువలో రూ.50 వేల వరకు ఆదాయం పొందవచ్చన్నారు. ఆయన వెంట మెంటర్ మహేష్, కోఆర్డినేటర్ భూషణ్, ఎంటీ జి.నిర్మలా దేవి, ఎల్‌డ్రీలు దీప, లత, పద్మజ, పరశురాం, రవి ఉన్నారు.

గ్రామీణ తపాలా ఉద్యోగుల ఆందోళన



గుమ్మలక్ష్మీపురం సబ్ పోస్టాఫీస్ ముందు నిరసన తెలుపుతున్న తపాలా శాఖ ఉద్యోగులు

గుమ్మలక్ష్మీపురం: గ్రామీణ తపాలా ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలని గుమ్మలక్ష్మీపురం సబ్ ఆఫీస్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న తపాలా శాఖ ఉద్యోగులు అధికారి జయంతిరావు, జి.చిన్నంనాయుడు, సీరాపు కళ్యాణి, పాలక సత్యనారాయణ, బి.రాజేష్ తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐజీడీఎస్ యూనియన్ పిలుపు మేరకు గురువారం గుమ్మలక్ష్మీపురం సబ్ పోస్టాఫీస్ ముందు తపాలా శాఖ ఉద్యోగులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8 గంటల పని మరియు పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలను మంజూరు చేయాలని, సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు 12, 24, 36 సంవత్సరాల సర్వీసుకు అదనంగా ఉన్నతి కల్పించాలని, గ్రూప్ ఇన్సురెన్స్ రూ.5 లక్షలకు పెంచాలని, గ్రాట్యూటీ రూ.5 లక్షలను పెంచాలని, పెయిడ్ లీవ్‌ను 180 రోజుల వరకు దాచుకొని నగదుగా మార్చుకొనే సౌకర్యం కల్పించాలని, జీడీఎస్ మరియు వారి కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పించాలని, టార్గెట్స్, మేళాలు రూపంలో జీడీఎస్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న అన్ని రకాల వేధింపులను ఆపి వేయాలంటూ డిమాండ్ చేశారు.

నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలి

సీతానగరం: నులిపురుగుల నివారణ (ఆల్బెండజోల్) మాత్రలు నిర్దేశించిన వయస్సు కలిగిన పిల్లలు విధిగా వేసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలో వైద్యాధికారుల పర్యవేక్షణలో గురువారం నిడగల్లు, సూరంపేట గ్రామాల్లో గల ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు,అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించిన నులిపురుగుల నివారణ మాత్రలు వేసే కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నులిపురుగుల నివారణ మందులు 1 నుంచి 19 సంవత్సరాల వయస్సులోపు ఉన్న విద్యార్థులు, యువకులకు వేయవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సహోపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డీఈసీ మాత్రలు వేయించాలి

వైద్యారోగ్యశాఖ అధికార సిబ్బంది పిల్లల ఆరోగ్యానికి పరిరక్షణకు వేస్తున్న నులిపురుగుల నివారణ మాత్రలు మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు వేయించాలని ఎంఈఓ జి.సూరి దేముడు కోరారు. ఈ మేరకు గురువారం జోగింపేట డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ గురుకులం (కేజీబీవీ)లో సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేసిన కార్యక్రమంలో ఎంఈఓ సూరి దేముడు పాల్గొన్నారు.



నులిపురుగుల నివారణ మాత్రలు విద్యార్థులకు వేస్తున్న డీఐఓ డాక్టర్ జగన్‌మోహనరావు

ఆల్‌బెండజోల్ మాత్రలు వేయించాలి

పార్వతీపురం: విద్యార్థులందరికీ ఆల్‌బెండజోల్ మాత్రలను వేయించాలని పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా గురువారం పార్వతీపురం, బెలగాంలోని ఏకలవ్య పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పలువురు విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1నుంచి 19 ఏళ్లున్న విద్యార్థులందరికీ ఆల్‌బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. విద్యార్థులు ఎవరైనా పాఠశాలకు రాకపోతే వారిని గుర్తించి మాత్రలు పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాత్రలు వేస్తున్న పీఓ విష్ణుచరణ్

వేడుకగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

భామిని: స్థానిక ఎంఎంపీ పాఠశాల ప్రాంగణంలో యూటీఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ పతాకాన్ని మండల శాఖ అధ్యక్షుడు ఈగల తిరుపతిరావు ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేసేందుకు యూటీఎఫ్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. పాఠశాలల విలీనంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని కోరారు.